www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 నవంబర్ 2025



ఆస్పత్రి స్థలాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలో నూతనంగా నిర్మించనున్న ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని గురువారం ఉదయం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సిబ్బందికి ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలం, ఇతర అంశాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేస్తున్న జెసి రాజేంద్రన్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రైతుల నుండి ధాన్యం సేకరణ, ప్రజల నుంచి వివిధ అంశాలపై సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సిటిజన్ సర్వే, సంక్షేమ హాస్టళ్లలో పారిశుధ్యం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుండి కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో గంజాయి ఉత్పత్తిదారులు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నక్యాంటీన్లలో పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. జిఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ద్వారా ప్రజలందరికీ ఇకెవైసి సర్వే నిర్వహించాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం సేకరణ త్వరగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులకు ఆయా శాఖల అంశాలకు సంబంధించి తగు సూచనలు జారీ చేశారు. సంక్షేమ హాస్టళ్లు మరియు పాఠశాలలలో కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ధైర్యంగా ఉండండి వచ్చేది మన ప్రభుత్వమే

- సమస్యలపై పోరాటం చేద్దాం
- నాయకులతో వై.ఎస్.జగన్

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

వచ్చేది మన ప్రభుత్వమేనని అందరూ ధైర్యంగా ఉండాలని, సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. పులివెందుల మూడు రోజుల పర్యటన భాగంగా మూడో రోజు గురువారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసిపి ముఖ్య నాయకులు కలిసి ప్రస్తుత నియోజకవర్గంలోని సమస్యల గురించి ఆయనకు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ 2029లో మనమే అధికారంలోకి వస్తామని ఆయన తెలిపారు. గ్రామాలలో కూటమి నాయకులు చేస్తున్న ఆగడాలకు ఎవరు భయపడకూడదని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. కార్యకర్తలకు ధైర్యాన్ని నింపి పార్టీని బలోపేతం చేయాలని ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామన్నారు. **వైసిపి శ్రేణుల్లో జోష్...** వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా వైసిపి శ్రేణులలో జోష్ నింపింది. ఎన్నడూ లేని విధంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓపిగ్గా వారి సమస్యలు వింటూ తాను ఉన్నానంటూ ధైర్యాన్ని నింపారు. నిరుత్సాహం, అధైర్యంతో ఉన్న నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. అధైర్య పడకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ పార్టీని బలోపేతంకి కృషి చేయాలని పేర్కొన్నారు. **ముగిసిన వైఎస్ జగన్ పర్యటన,,** పులివెందుల మూడు రోజుల పర్యటన గురువారం ముగిసింది. మొదటిరోజు ప్రజాదర్బార్ నిర్వహించి నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రెండో రోజు అరటి తోటలను పరిశీలించి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైతు పక్షాన పోరాటాలు చేస్తామని వెల్లడించారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఇటీవల మరణించిన వైసిపి నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. 3వరోజు ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ఉదయం 9:30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకి వెళ్లారు. కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వీడ్కోలు పలికారు.



జగన్‌కు వీడ్కోలు పలుకుతున్న కడప ఎంపీ, ఎమ్మెల్యేలు, వైసిపి జిల్లా నాయకులు

మైనార్టీల శ్రేయస్సు వైసిపితోనే సాధ్యం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని మైనార్టీల సామాజికాభివృద్ధే వైసిపి లక్ష్యమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం మైనార్టీ నాయకులు గురువారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో మైనార్టీలకు పెద్దపీట వేసి సముచిత గౌరవాన్ని కల్పించామని తెలిపారు. ఉన్నతమైన ఉప ముఖ్యమంత్రి, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పదవులతో పాటు నలుగురికి ఎమ్మెల్సీ పదవులు, 13 మందికి కార్పొరేషన్ల చైర్మన్ పదవులను అప్పటి సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మైనార్టీలకు ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రభుత్వ సలహాదారు పదవులు ఇచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మసీదులు, దర్గాలు, ఈద్గాలు తదితర మైనార్టీల ధార్మిక సంస్థల అభివృద్ధికి విశేష కృషి జరిగిందన్నారు. గత వైసిపి పాలనలోనే ఉర్దూను ద్వితీయ అధికార భాషగా పరిగణిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. మైనార్టీల శ్రేయస్సు వైసిపితోనే సాధ్యమని తెలిపారు. మైనార్టీల అభ్యున్నతి తమ పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థాగతంగా పార్టీ పదవుల్లోనూ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, నాయకులు ఖాదర్‌బాషా, సమీ, అమిన్‌పీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థవంతమైన నాయకత్వానికి దరఖాస్తులు

- ఎఐసిసి పరిశీలకులు కె.మహేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రన్

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎఐసిసి పరిశీలకులు కె.మహేంద్రన్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణంలో భాగంగా అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి సమర్థవంతమైన ఆసక్తి కలిగిన నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ పార్టీని జిల్లాలో అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఎపిసిసి పరిశీలకులు అశోక్ రత్నం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజుల భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేసేందుకు నాయకులు,ా ర్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ప్రతినిధులు, మండల శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయుటకు భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లా అధ్యక్ష పదవి కోసం పరిశీలకులకు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పిసిసి ప్రతినిధి ఎస్.ఎం.డి.గౌస్‌తో పాటు అన్నమయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, సేవాదళ్ సభ్యులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ బేస్‌లైన్ టెస్ట్ తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలం మోటకట్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి బేస్‌లైన్ టెస్ట్‌ను గురువారం డైట్ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బేస్‌లైన్ టెస్ట్ ద్వారా విద్యార్థులలో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పిక్చర్ రీడింగ్, అక్షరాల గుర్తింపు, పదాల పఠనం, పేరాగ్రాఫ్ చదవడం, కథ అవగాహన వంటి అంశాలను పరీక్షిస్తున్నామని పేర్కొన్నారు. గణితంలో సంఖ్యల గుర్తింపు, తీసివేత, గుణకం, భాగాకారం వంటి ప్రాథమిక నైపుణ్యాల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పరీక్ష ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకోవడంతో పాటు, ఏ పాఠశా లలు, క్లస్టర్లు, జిల్లాలు వెనుకబడి ఉన్నాయో స్పష్టత లభిస్తుందని చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 2026 నాటికి ప్రతి విద్యార్థి ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలను సాధించేందుకు రీమిడియల్ బోధన, ప్రత్యేక శిక్షణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చప్పిడి పద్మజ, చాత్రోపాధ్యాయులు షేక్ అతియా, రజియా, సీఆర్‌పీ వసుంధర, ఉపాధ్యాయులు నాగేశ్వర నాయక్, నరసింహులు, నాగ శేషారెడ్డి, గొబ్రే నాయక్ పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి గురువారం మదనపల్లెలో పర్యటించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. మదనపల్లి గ్రామీణ మండలం సిటిఎం రోడ్డు ఓవర్ బ్రిడ్జి నుండి పార్టీ శ్రేణులతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీ ర్యాలీగా చేరుకున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీకి పెద్ద ఎత్తున ప్రజలు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, వైస్ చైర్మన్లు నూర్ అజాం, జింక చలపతి, వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎ.కరీముల్లా, ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున, కౌన్సిలర్లు సుగుణ ఆంజనేయులు, ఈశ్వర్ నాయక్, పాల్ చంద్రశేఖర్, రాజేష్, రేణుకమ్మ పాల్గొన్నారు.

అటల్ శిక్షణను సందర్శించిన యూనిసెఫ్ ప్రతినిధి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అటల్ టింకరింగ్ పాఠశాలల వర్క్‌షాప్‌ను యూనిసెఫ్ ప్రతినిధి సుదర్శన్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వర్క్‌షాప్‌లో ఆటల్ టింకరింగ్ పాఠశాలల ఉపాధ్యాయులు రూపొందిస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ప్రయోగశాలలలో అటల్ కేలండర్‌ను అనుసరించి క్రమం తప్పకుండా విద్యార్థులతో ప్రాజెక్టులు చేయించాలని సూచించారు. ఉపాధ్యాయులు నిర్వహించిన ఈ కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు ప్రతినెలా మానిటరింగ్ చేసి లీఫ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఒక నెలలో జరిపిన కార్యక్రమాలనన్నింటినీ అటల్ డాష్ బోర్డులో తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆటల్ ఇన్నోవేషన్ మిషన్, రాష్ట్ర సమగ్ర శిక్ష, యూనిసెఫ్ ఈ కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటల్ ప్రయోగశాలలో కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థులు శాస్త్రవేత్తలుగాను, వ్యవస్థాపకులుగాను రూపొందుతారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అసిస్టెంట్ ఎఎంఒ అసదుల్లా, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి, మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్



వృద్ధుల ఆరోగ్య సమస్యలపై అవగాహన ఇస్తున్న వైద్య బృందం

వృద్ధుల జ్ఞానసంపద యువతకు ఆదర్శం

ప్రజాశక్తి-పీలేరు: కుటుంబంలో వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మనం మన ఆరోగ్యాన్ని జాగ్రత్తపరచుకోవడమేనని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష తెలిపారు. గురువారం మండలంలోని జాండ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ఆరోగ్య సేవల కార్యక్రమాన్ని నిర్వహించి మధుమేహం, రక్తపోటు, మాతృ సేవలు, సాధారణ వ్యాధిగ్రస్తులకు వ్యాధినిర్ధారణ పరీక్షలు, చికిత్సలు నెలకు సరిపడ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరికి వృద్ధాప్యం సహజమని, ఇదో రెండో బాల్య దాస్య అని, జ్ఞాపక శక్తి తగ్గడం, నిద్రలేమి, కుంగుబాటు వంటి సమస్యలు ఎదురవుతాయని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మనం మన ఆరోగ్యాన్నీ కాపాడుకుంటూ కుటుంబ మన్నలను పొందాలని, మీరు ఒంటరి కాదు మీకు అండగా ఆరోగ్య సేవలు వున్నాయని వృద్ధులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, ఎఎన్ఎం కృష్ణమ్మ, సిహెచ్ఒ లావణ్య, డిఇఒ సుధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టం : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె జిల్లా ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టమని నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువనేత కొణిదెల లోకేష్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో తెలుగు తమ్ముళ్లు బాణసంచా పేల్చి, థాంక్యూ సిఎం సార్ అంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదీర్ఘమైన చరిత్ర, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన మదనపల్లెను కూటమి ప్రభుత్వం జిల్లాగా ప్రకటించడంతో సర్వత్ర హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. భారత దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ప్రసిద్ధిగాంచిన మదనపల్లెని జిల్లా చేయకుండా అప్పటి వైసిపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మదనపల్లి జిల్లా ఏర్పాటుకు సహకరించిన సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే షాజహాన్ బాషాలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నిరంజన్ నాని, రాజేష్ రాటకొండ, వంశీ నరసింహా, రాటకొండ గగన్, మహేష్ రాటకొండ, అయూబ్ బాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీరామ్, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ షేక్ మహమ్మద్, రాయచోటి క్లబ్ అధ్యక్షులు పసుపులేటి మేఘశ్యామ్ అన్నారు. బుధవారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులు పట్టణంలో రోడ్లపై నిద్రిస్తున్న యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల నిరాధారణకు గురై ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వాసుపత్రి, వీరభద్రాలయం, షిర్డీ సాయి బాబా దేవాలయంతోపాటు రోడ్లు బహిరంగ ప్రదేశాలపై నిద్రిస్తూ చలికి వణుకుతున్న వారికి క్లబ్ సభ్యులు దుప్పట్లను అంద జేశారు. దాత కే మనోహర్ రాజు ఆర్థిక సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షులు పెడబల్లి శివారెడ్డి, కార్యదర్శి ఇందాద్ అహ్మద్ పాల్గొన్నారు.

వైవీయూలో పీజీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తృతీయ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 450 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని సిఇ తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కాత్యాయని మార్గదర్శకంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అబ్జర్వర్ డాక్టర్ కె.మృత్యుంజయరావు పర్యవేక్షించారు. పరీక్షలు నిర్వహణలో అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ముని కుమారి, సిబ్బంది చంద్రమౌళి ఉన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్‌డిఎం ఆంజనేయులు

ఖాతాల పునరుద్ధరణకు అవకాశం : ఎల్‌డిఎం

ప్రజాశక్తి-రాయచోటి: బ్యాంకుల్లో పది సంవత్సరాలుగా లావాదేవీలు జరుపకుండా ఉన్న ఖాతాలు పునరుద్ధరించుకోవాలని ఎల్‌డిఎం ఆంజనేయులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక సేవల విభాగం సూచనల మేరకు మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం గురువారం రాయచోటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ అవకాశం వియోగించుకొని ఖాతాలు పునరుద్ధరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహక అధికారి సదాశివరెడ్డి, వివిధ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి -కడప అర్బన్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, విజయవాడ వారి ఆదేశాల మేరకు యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు అర్హులైన బిసి, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీ బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 17 నుంచి 25వ తేదీ లోపు బిసి స్టడీ సర్కిల్, బిసి భవన్, వైయస్సార్ కడప కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఈ గడువును డిసెంబర్ మూడవ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంపికైన వారికి బీసీ భవన్, గొల్లపూడి, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తు తో పాటు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్క్ లిస్ట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు జతపరిచి నేరుగా పాత రిమ్స్‌లో ఉన్న కడప బీసీ భవన్‌లో అందజేయాలని తెలిపారు. వివరాలకు 9703185382, 9849919221 నంబర్లు సంప్రదించాలని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పీలేరు: డిసెంబర్ 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్ తెలిపారు. గురువారం స్థానిక కోర్టులో ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులతో న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మోటారు వాహన కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. సమావేశంలో పలువురు న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి మహేష్

రోడ్డు ఆక్రమణను ఆపాలంటూ ఆందోళన

ప్రజాశక్తి-పీలేరు

రోడ్డు దురాక్రమణలను ఆపాలంటూ స్థానికులు ఆందోళన చేపట్టారు. పీలేరు పట్టణం, తిరుపతి రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న 30 అడుగుల రోడ్డు దురాక్రమణల పాలవుతోందని, దాన్ని సంబంధిత అధికారులు అడ్డుకోవాలంటూ ఆపాలంటూ గురువారం ఆ ప్రాంత వాసులు, విఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ స్థానిక తిరుపతి మార్గం నుంచి విఎస్ఎన్ సిద్ధార్థ విద్యా సంస్థ మీదుగా నాగిరెడ్డి కాలనీ వాసుల కోసం 30 అడుగుల రోడ్డు కొరకు స్థలం వదిలారని పేర్కొన్నారు. అందులో పీలేరు గ్రామ పంచాయతీ 20 అడుగుల సిమెంటు రోడ్డు కూడా నిర్మించారని, మిగిలిన 10 అడుగులను సిమెంటు రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువల కోసం వదిలి పెట్టారన్నారు. తిరుపతి రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు 30 అడుగుల సిమెంటు రోడ్డును కేవలం 18 అడుగుల వెడల్పు వరకు కుదించి, మిగిలిన రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టడంపై వారు మండిపడ్డారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై కబ్జాదారులు దౌర్జన్యం చేయడం, వ్యంగంగా సమాధానాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కుంచించుకు పోయిన రోడ్డు కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని, ఫలితంగా కాలనీ వాసులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకపోకలకు పరిస్థితి ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి, రోడ్డు ఆక్రమణల బారిన పడకుండా కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇటీవల అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇచ్చినా తమకు తగిన న్యాయం జరగలేదన్న నిస్సహాయతను వారు వ్యక్తం చేశారు.



రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలంటూ ఆందోళన చేపట్టిన స్థానికులు


నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూములకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆలయానికి రూ.1.60 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.1,60,500లు ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ టి.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవ స్థానానికి సంబంధించిన 19సర్వే నెంబర్లలోని భూములలో 6సర్వే నెంబర్‌లోని భూములను మూడు సంవత్సరాల ఫలసాయం కోసం రైతులకు కౌలుకు ఇవ్వడానికై దేవాదాయశాఖ అధికారి శశికుమార్ పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటను నిర్వహించామన్నారు. సర్వేనెంబర్ 600/ఎ లోని భూమిని మూడేళ్ల కాలానికి నల్లం వారిపల్లెకు చెందిన పి.మణికంఠ అత్యధికంగా రూ.1.50లక్షలు దక్కించుకోగా మిగిలిన ఐదు సర్వే నెంబర్‌లోని భూమిని తక్కువ మొత్తానికి రూ.10,500లకు ముగ్గురు దక్కిం చుకున్నారు. భూములు వేలం ద్వారా మూడేళ్ల కాలానికి రూ.1,60,500లు ఆదాయం ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. ఆలయానికి చెందిన మామిడితోపు వేలంపాటను సర్కారు పాట రూ.1.50లక్షల నుంచి రూ.లక్ష వరకు తగ్గించిన పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో మామిడి తోపు వేలాన్ని వాయిదా వేశామన్నారు. ఈ మొత్తాన్ని ఆలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్, వాల్మీకిపురంలో జమచేస్తామన్నారు. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు రెడ్డప్ప, టిడిపి నాయకులు రాజన్న, సుధాకర, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు రెడ్డి మోహన, సహదేవ, చిన్నరెడ్డప్ప, దేవాదాయ శాఖ అసిస్టెంట్ మహేష్, రైతులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవంలో పెండ్యాల విజయ్

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధే లక్ష్యం

- నూతన అధ్యక్షులుగా విజయ్‌కుమార్ ప్రమాణం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధే నా ప్రధాన లక్ష్యమని ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు పెండ్యాల విజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష ఎన్నికలలో విజయ్‌కుమార్ ఘన విజయం సాధించారన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఉత్సవ మండపంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ డూండీ రాకేష్ హాజరయ్యారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులుగా పెండ్యాల విజయ్ కుమార్ చే వేద పండితులు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా కలువా మురళీధర్, కోశాధికారిగా పెడబల్లె సుబ్బారావు, ఉప కార్యదర్శిగా తిరునామల సత్యనారాయణ, ఉప కోశాధికారిగా టంగుటూరి దశరథ, ఎస్‌కెపిడి అధ్యక్షులు శ్రీరామ్, సుబ్రహ్మణ్యం పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు మేడా వెంకటసుబ్బయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, రాష్ట్ర ఖాది గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి శాఖ చైర్మన్ కెకె.చౌదరి, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వై.జయప్రకాష్, పంతగాని నరసింహప్రసాద్, మాజీ అధ్యక్షులు కొప్పరపు నరసింహులు, గునిశెట్టి రమేష్ కామిశెట్టి పార్ధసారథి,ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.




రైతులకు రాయితీ పశువుల దాణా అందిస్తున్న అర్షద్

రాయితీపై పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయితీపై ప్రభుత్వం అందించే పశువుల దాణాను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల నాయకులు అర్షద్ పేర్కొన్నారు. మండలంలోని టి.చాకిబండ గ్రామంలో రైతులకు 50 రాయితీతో పంపిణీ చేశారు. మండలానికి దాదాపుగా 42.5మెట్రిక్ టన్నుల పశువులదాణాను ప్రభు త్వం మంజూరు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ప్రతి ఒక పాడి రైతు సబ్సిడీని ఉపయోగించుకొని పాల దిగుబడి పెంచుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు ఆనందరెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజ, రఘునాథరెడ్డి, అక్రమ్, రాజేంద్ర, కార్తీక్ పాడి రైతులు పాల్గొన్నారు.


ఎంపీ మిథున్‌రెడ్డితో వైసిపి నాయకులు

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

మండలంలోని కలికిరిరెడ్డివారిపల్లికి వచ్చిన రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కలికిరి వైసిపి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని నాగిరెడ్డి ఆయన కుమారుడు వినయ్ కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి నూతనంగా నిర్మించిన గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మైనార్టీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ మైనింగ్ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, సర్పంచులు వెంకట్ రెడ్డి, గంగయ్య, నాయకులు హనీప్, ద్వారకనాథరెడ్డి, మాసూమ్ రఫి, ఎస్‌టిడి హరి, వేంపల్లి ఖాదర్బాషా, వేంపల్లి ఫయాజ్, శామ్యూల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీతో మోహివుద్దీన్,,



కలికిరి : వైసిపి రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్. అఫూ మోహివుద్దీన్ గురువారం తిరుపతిలోని మిథున్‌రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ స్థితి గతులపై చర్చించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే రచ్చబండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారమే రచ్చబండ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పిటిఎం మండలంలో రచ్చబండ కార్యక్రమంలో ప్రజలతో కలిసి మాట్లాడారు. స్థానిక నాయకుల ఆహ్వానం మేరకు బైపాస్ రోడ్డులో బి.కొత్తకోట యువతతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు న్యాయం చేసే విధంగా అందరూ కృషి చేయాలని సూచించారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు, అభిప్రాయాలు, అవసరాలు ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను వేగంగా అందించడానికి ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. ప్రతి ఇంటి ముందుకు చేరుకుని ప్రజలతో మమేకమై మాట్లాడటం, వారి జీవన విధానాన్ని అర్థం చేసుకోవడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పనులను గురించి తెలుసుకున్నారు. కూటమి పాలన అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, సురేంద్ర ఇంతియాజ్, పిటిఎం మంజు, వైసిపి పట్టణ అధ్యక్షుడు సిఆర్ చిన్నికృష్ణ, ఎంపిటిసి నాగార్జున్ రెడ్డి, మాజీ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, మాజీ సచివాలయ కన్వీనర్ జి.చాంద్‌బాషా, వైసిపి నాయకులు బాంబే మోదిన్, టిజనార్ధన్,ఎస్. మొహమ్మద్ సాదిక్, బిసి కాలనీ బాబాజాన్, సబ్జీ, తరుణ్, రత్నమయ్య పాల్గొన్నారు.


రచ్చబండ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పిజిఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న మదన్‌మోహన్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పిజిఆర్ఎస్ అర్జీలను సత్వర పరిష్కారం చూపాలని టిడిపి మండల ఇన్‌ఛార్జి యనమల మదన్‌మోహన్ తహశీల్దార్ ఎన్.క్రాంతి కుమార్‌ను కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ అవ కతవకలను రెవిన్యూ రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలు భూ సమస్య పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించి అర్హులైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు చాలా జరిగాయని భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతులకు శాశ్వతంగా భూసమస్యలు లేకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగేలా వ్యవ హరించి వీలైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజష్ విఆర్ఒలు, విలేజ్ సర్వేర్లతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు కావలి ఆంజనేయులు, మల్లి, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు, శంకర, రాజంపేట పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు రమ్య రాయల్, శివ మోహన్ నాయుడు, రజాక్, వెంకటరమణ, వరప్రసాద్, ఆర్కే హేమంత్, వెంకీ, బోనాల ధన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడే వారికి పార్టీలో ప్రాధాన్యత

లక్కిరెడ్డిపల్లి :కష్టపడి పనిచేసే వారికే తెలుగుదేశం పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని లక్కిరెడ్డిపల్లె మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన మండల కమిటీ సభ్యులకు, నూతనంగా ఏర్పడిన క్లస్టర్, కో-కన్వీనర్లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించేందుకు ఃమంత్రివర్యులు శ్రీ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఎల్లవేళలా అందుబాటులు ఉంటారని అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి ప్రజా సమస్యలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కోసం పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నూతనంగా ఏర్పడిన మండల కమిటీ సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన ఆరు మండలాల టిడిపి అధ్యక్షులు, రాజంపేట మున్సిపాలిటీ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక ఎబి చంద్రారెడ్డి గార్డెన్స్‌లో అంగరంగ వైభవంగా పార్టీ మండల అధ్యక్షులు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు భీమినేని చిట్టిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నికైన నాయకులు కృషి చేయాలని సూచించారు. కష్టపడిన వారిని పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు.ఎన్నికైన నూతన అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జగన్‌మోహన్‌రాజు, చిట్టిబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ వివిధ రకాల అనుబంధ సంఘాల అధ్యక్షులు, పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


టిడిపి మండల అధ్యక్షులుగా ప్రమాణం చేసిన వారితో చమర్తి

మండలాధ్యక్షుడిగా రమేష్‌నాయుడు ఎంపికపై హర్షం

సుండుపల్లి :మండల టిడిపి అధ్యక్షుడిగా చప్పడి రమేష్ నాయుడు ఎంపికపై మండల టిడిపి సీనియర్ నాయకులు కాంచన రెడ్డయ్య హర్షం వ్యక్తం చేశారు. సుమారుగా 40 సంవత్సరాల నుంచి టిడిపికి చప్పిడి కుటుంబం మండల, గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. తన సొంత నిధులతో నిధులతో మారుమూల ప్రాంతాలకు తాగునీటి పైపులైన్లు, విద్యుత్ మోటార్లు ఏర్పాటుతో మౌలిక వసతులు కల్పించారని అన్నారు. తన తండ్రి రెడ్డివారి పల్లెకు మాజీ సర్పంచ్‌గాను, తన తల్లి ఎంపిటిసిగాను ప్రజాప్రతినిధులుగా జి.రెడ్డివారిపల్లి గ్రామానికి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌నాయుడు, నాగార్జుననాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలు నిర్మించాలి


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహమ్మద్ షరీఫ్

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని టి.సాకిబండ గ్రామంలో దారిద్రరేఖ దిగువనున్న ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కా గృహాలను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇల్లు, స్థలం, లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంపిణీ చేసి గృహ నిర్మాణాలను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. టి.సాకిబండ సచివాలయం సమీపంలో గల సర్వే నెంబర్ 891 సుమారు 50 సెంట్లు విస్తీర్ణం కలద న్నారు. ఇది ప్రభుత్వ భూమి కనుక మండల రెవెన్యూ అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఇల్లు నిర్మించుకోవడానికి స్థలాని కేటాయించాలని మండల టిడిపి ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్ తహశీల్దార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహాయ సహకారాలతో ఇల్లు స్థలం లేని పేదలకు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగాల ఈశ్వరయ్య, టిడిపి మండల కార్యదర్శి తంగాల రెడ్డి శేఖర్, టిడిపి నాయకులు న్యామత్, బి వెంకటరమణ, ఫయాజ్, టిడిపి కార్యకర్తలు ,నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి

- హాస్టళ్ల యాజమాన్యం సమావేశంలో సిఐ రవి

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్


పట్టణ సమీపంలోని మిట్స్ యూనివర్సిటీలో గురువారం స్థానిక అంగళ్లు హాస్టల్ యాజమాన్యంతో కలిసి ప్రాంగణంలో సమావేశం నిర్వహించినట్లు విసి డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె రూరల్ సిఐ రవినాయక్, ఎస్ఐ మధు రామచంద్రుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ హాస్టళ్లలో సురక్షితమైన, క్రమశిక్షణా వాతావరణం నిర్వహించడం ఎంత కీమలన్నారు. వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల భద్రత కోసం ఫిర్యాదుల పరిష్కారం భద్రతా ఆడిట్‌లను క్రమంగా నిర్వహించాలని సూచించారు. హాస్టళ్లు విద్యార్థులకు రెండవ ఇల్లుగా ఉండాలని భద్రత, క్రమశిక్షణ నియమాలు అనేవి విద్యార్థుల శ్రేయస్సును విద్యా విజయాన్ని ప్రభావితం చేసే బాధ్యతని చెప్పారు. ఎస్ఐ మధు రామచంద్రుడు మాట్లాడుతూ విద్యాసంస్థలు భద్రతా వాతావరణాన్ని సృష్టించడంలో పోలీసు శాఖ పూర్ణ మద్దతు తెలుపుతోందని హాస్టల్ నిర్వాహకులు ప్రతి విద్యార్థి, వారి కుటుంబ వివరాలను నమోదుచేయాలని తెలిపారు. హాజరు పర్యవేక్షణ, సరైన లైటింగ్ నిఘా వ్యవస్థలువంటి చర్యలను తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన, ర్యాగింగ్ నిరోధక విధానాలు నేటి కాలంలో ఎంతో అవసరమని చెప్పారు. సమావేశంలో యూనివర్సిటీ సిబ్బంది మారుతీప్రసాద్, రియాజ్‌అలీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మదనపల్లె రూరల్ సిఐ రవినాయక్

కిలో టమోటా రూ.100

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని కూరగాయల సంతలో టమోటా ధర కిలో రూ.100లు పలికింది. గ్రామీణ ప్రాంతంలో చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సంతలో కూరగాయలు విక్రయిస్తుంటారు. సంతలో టమోటా వంద రూపాయలు ఉండటంతో కొనకుండా వెనక్కి వెళ్లిపోయారు. టమోటాకు ధర వచ్చిందంటే వంద నుంచి రూ.200వరకు పోయినా ఆశ్చర్య పడన వసరం లేదని చెబుతున్నారు. టమోటాకు ధర లేనప్పుడు పండించిన రైతు టమాటాలను నేలపై పారేసి వెళ్లే పరిస్థితులు ఉన్నాయని ఇప్పుడు పంట లేక ధరలు అమాంతంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. టమోటాతో పాటు మిగత కూరగాయాలు కూడా అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామన్య, మధ్య తరగతి ప్రజలు ఇంత రేటు వెచ్చించి కొనుక్కునే పరిస్థితి లేదని పచ్చడి మెతుకులే భారమయ్యే ఉందని చెప్పారు. నిత్యావసర ధరలతో పాటు కూరగాయ ధరలు కూడా అమాంతంగా పెరగంతో ఏమి కొనే పరిస్థితి లేదన్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పేద ప్రజల జీవనం మరింత భారమవుతుందన్నారు.


కూరగాయల సంతలో టమోటాలు



వర్షపునీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వర్షపు నీటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్పెషల్ క్యాంపులో భాగంగా దత్తత గ్రామమైన అసాదివాండ్లపల్లిలో ప్రజలకు వర్షపు నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకొని ఇంటి ఇంటికి వెళ్లి రైతులకు వర్షపు నీటిని ఎలా ఒడిసి పట్టుకోవాలి, నీటి ప్రాముఖ్యత ఎంత, అది రైతుకు ఏ రకంగా ఉపయోగపడుతుందే విషయాలను వివరించి చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏవి అనే విషయాలపై ప్రజలకు నీటి ఆవశ్యకతను గురించి తెలియజేస్తూ గ్రామమంతా పర్యటించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు భోజనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రఘురామయ్య మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని, నీరు లేనిదే మనిషి మనుగడ కష్టమన్నారు. రైతులు తమ పొలాలలో ఇంకుడు గుంతలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో ప్రభుత్వ భూముల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా చెట్ల పెంపకం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మరో ఎన్ఎస్ఎస్ పిఒ సి.భాస్కర్ వాలంటీర్లు పాల్గొన్నారు.


మహిళలకు ఇకెవైసి చేస్తున్న సిబ్బంది

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-కలకడ

నూతన గృహములకు దరఖాస్తు చేసుకునేవారు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు. మండలంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్‌టిఆర్ పథకం కింద దరఖాస్తు చేసుకునేవారు, ఎక్కడ గాని ప్రభుత్వం నుంచి ఇల్లు పొందకుండా ఉండాలని, స్థానిక మండల వాసులుగా ఉండాలని, ఆధార్, రేషన్ కార్డు తప్పక కలిగి ఉండాలన్నారు. దారిద్ర రేఖ దిగువన ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగం లేకుండా ఉండి, ఆదాయం పనులు చెల్లించకుండా ఉండేవారు, తక్కువ ఆదాయం కలిగి ఉండి మరియు పరిమితంగా భూమి కలిగి ఉన్నవారు, ఈ పథకానికి అర్హులని చెప్పారు. గురువారం ఇల్లు లేని నిరుపేద కుటుంబ మహిళలకు ఇకెవైసి చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌ఛార్జి ఎఇ భరత్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రతాప్, మహిళలుపాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఆదినారాయణ

జడ్‌పి హైస్కూల్‌లో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని చాకిబండకస్పాలో జడ్‌పి హైస్కూల్‌ను గురువారం ఎంపిడిఒ ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు.విద్యార్థులతో మాట్లాడుతూ చదువులో ఎటువంటి ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయ దృష్టికి తీసుకుని పోయి సమస్యల పరిష్కరించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ను జిల్లా కేంద్రంగా ప్రకటించిన అనంతరం విజయవాడ నుంచి తిరుపతి మీదుగా మదనపల్లికి వచ్చిన ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు గురువారం నియోజవర్గ తెలుగు శ్రేణులు కాశీరావుపేట వద్ద ఘన స్వాగతం పలికారు. కాశిరావుపేట నుంచి ర్యాలీ చేపట్టి సిటిఎం, ఆరోగ్యవరం, తట్టివారిపల్లి మీదుగా బాలాజీ కాలనీ, ఎస్టేట్, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా టౌన్ బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండుకు చేపట్టారు. 2021 నుంచి మదనపల్లి జిల్లా సాధన సమితి పేరుతో రామసముద్రం నుంచి గుర్రంకొండ వరకు పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే టిడిపిలో చేరి చేరినప్పటి నుండి మదనపల్లిను జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు విస్మరించబోనని ప్రజలకు హామీనిచ్చార న్నారు.

క్రైం కార్నర్

జార్ఖండ్ యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జార్ఖండ్ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన గురు వారం పట్టణంలో వెలుగు చూసింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం, హుస్సేన్‌బాద్ జిల్లా, జామియా గ్రామానికి చెందిన రాంప్రీత్‌వార్ కుమారుడు మోతిరావ్ వార్(23) రాజంపేటకు చెందిన సెంట్రింగ్ మేస్త్రి శ్రీనివాసులు దగ్గర పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మోతిరావ్ వార్ పోతుబోలు వద్ద ఓ ఇంటిపని చేస్తూ అక్కడ బస చేస్తున్నాడు. ఆ యువ కుడికి ఏమి కష్టం వచ్చిందో ఏమో, అసలు ఏమి జరిగిందో తెలియదు కానీ పోతబోలు గ్రామం, కురవపల్లి సమీపంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి తాలూకా పోలీ సులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఓ యువతీ కుటుంబ కలహాల కారణంగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చేరింది. గురువారం చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక చంద్ర కాలనీలో నివాసముంటున్న షంషీర్ భార్య రుబియా కుటుంబ సమస్యలపై ఇంట్లో గొడవ పడింది. దంపతులిద్దరూ మాటా, మాటా అనుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రుబియా ఇంట్లోనే మోల్డింగ్ కమ్మీకి ఉరి వేసుకుని ఆత్మ హత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.